# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు స్వస్తి చెప్పి బాధ్యత గల పౌరులుగా రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఖైదీలకు సూచించారు.
- ❖ మహిళల ఆర్థిక స్వావలంబన దేశ అభివృద్ధికి ప్రధాన ఆధారమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ❖ వాయువ్య బంగాళాఖాతం దాని సరిహద్దు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 13వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణం కేంద్రం వెల్లడించింది.

=========================

గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లగిశపల్లిలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్ద గిరిజన ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. స్టాళ్లను పరిశీలించారు. కాఫీ తోటల పెంపకందారులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సహజ నైపుణ్యం, సామర్థ్యం ఆదివాసీల సొంతమని, గిరిజనులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అవకాశాలు కల్పిస్తే గిరిజనులు అద్భుతాలు సృష్టిస్తారని, గిరిజన ప్రాంతాలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=========================

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు స్వస్తి చెప్పి బాధ్యత గల పౌరులుగా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఖైదీలకు సూచించారు. ఆమె ఈ రోజు విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. 30 మంది ఖైదీలకు

రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గంజాయి కేసులున్న ఖైదీలతో మాట్లాడారు. యువత మంచి, చెడుల తారతమ్యం తెలుసుకోవాలని, సులభంగా వచ్చే డబ్బు కోసం ఆశపడి నేరాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆనందంగా, నిజాయితీగా బతికేందుకు చాలా దారులున్నాయని వంగలపూడి అనిత తెలిపారు.

==========================

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీనిట్)లో 2021-2025 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు అధ్యక్షతన ఈ రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో 667 మంది విద్యార్థులకు డిగ్రీ, 29 మందికి డాక్టరేట్ పట్టాలను ప్రధానం చేశారు. ఈ సదర్భంగా ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ... విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, ఆధునిక నైపుణ్యాలు అత్యున్నత స్థానాలకు ఎదగడానికి ఉపయోగపడతాయన్నారు. ముఖ్య అతిధిగా హాజరైన ఒక ప్రముఖ సాఫ్ట్ వేర్ సర్వీసెస్, కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ అధ్యక్షులు వి.రాజన్న మాట్లాడుతూ... దేశ భవిష్యత్‌లో  డిజిటల్ సాంకేతికత ప్రముఖ శక్తిగా మారుతున్నదని తెలిపారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

ఖైదీల పట్ల జైలు సిబ్బంది, తోటి ఖైదీలు ఎటువంటి వివక్ష చూపించరాదని  పార్వతీపురం మన్యం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికర సంస్థ ఉత్తర్వుల మేరకు... ఈరోజు బొబ్బిలి, పార్వతీపురం సబ్ జైళ్లను ఆయన సందర్శించారు. జైళ్లలో సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వారి పట్ల వివక్ష చూపితే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. నేర ప్రవృత్తిని వీడి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రిమాండ్ లో ఉన్న ప్రతి ముద్దాయికి న్యాయవాది ఉండాలని, అలాలేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది సేవలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

విరామం

==========================

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఈ రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణా నగర్ బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ 2వ బెటాలియన్ పోలీసులకు తిరంగా రాఖీలు కట్టారు. యువజన సర్వీసుల శాఖ అధికారి వేణుగోపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ భద్రతకు, సమగ్రతకు అహర్నిశలు పాటుపడుతున్న సైనికులు, సాయుధ దళ పోలీసుల సేవలు వెలకట్టలేమని అన్నారు. బెటాలియన్ అసిస్టెంట్ కామాండెంట్ మహబూబ్ బాషా మాట్లాడుతూ... చిన్నారులు తిరంగా రాఖీలు కట్టి వారి దేశ భక్తిని చాటడం అభినందనీయమని తెలిపారు.

==========================

మహిళల ఆర్థిక స్వావలంబన దేశ అభివృద్ధికి ప్రధాన ఆధారమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ రోజు గుంటూరులో నిర్వహించిన మహిళల టైలరింగ్ శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలకు అందించే వృత్తిపరమైన శిక్షణ వారికి ఉపాధి మాత్రమే కాదని, సృజనాత్మకతకు కూడా వేదికగా ఉంటుందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన, ముద్రా లోన్‌లు వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్లు, శిక్షణా కార్యక్రమాలు మహిళల వ్యాపార అవకాశాలను పెంచుతున్నాయని తెలిపారు. టైలరింగ్ రంగంలో ఆధునిక డిజైన్‌లు, మార్కెటింగ్ మెళకువలు గూర్చి తెలుసుకుంటే మహిళలు ప్రపంచ మార్కెట్లతో పోటీ పడగలరని వివరించారు.

==========================

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఏడాదిలో వెయ్యి కోట్ల రూపాయాల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. గిరిజన యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికే 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

==========================

విశాఖపట్నంలో సిలిండర్ పేలుడు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికీ 10 లక్షల రూపాయల చొప్పున మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు అందజేశారు. గాయపడి చికిత్స పొందుతున్న వారిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... సిలిండర్ పేలుడు ఘటనపై పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతోందని, పేలుడుకు గల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. సముద్రంలో దొరికిన గుర్తు తెలియని వస్తువులను భద్రపరచడం, వాటి గురించి అధికారులకు సమాచారం ఇవ్వడంపై మత్స్యకారులకు పోలీసు, రెవిన్యూ శాఖల ద్వారా అవగాహన కలిగిస్తామని చెప్పారు.

==========================

శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈరోజు ఉదయం విజయవాడలో ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ జరిగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు కామధేను అమ్మవారి ఆలయం దగ్గర నుండి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది.

==========================

వాయువ్య బంగాళాఖాతం దాని సరిహద్దు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 13వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు ఉత్తర, కోస్తాంధ్రలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకటరావు వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================
==========================